ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

దోమకొండ, జనవరి 5 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దోమకొండ ఏఎస్సై అన్నారు. మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి సైబర్ నేరాలపై స్థానికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని అన్నారు. సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చారిత్రాత్మక ప్రదేశాల సందర్శన

రామప్ప ఆలయం వద్ద
బీబీపేట బాలికల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు

బీబీపేట్, జనవరి 5 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు విజ్ఞాన యాత్రలో భాగంగా శుక్రవారం రామప్ప ఆలయం, లక్నవరం, వరంగల్‌లోని చారిత్రాత్మక ప్రదేశాలు, కాకతీయుల కాలంలో నాటి కట్టడాలను పరిశీలించారు. వాటి గొప్పతనాన్ని విద్యార్థులకు చూపించేందుకు విహారయాత్రకు తీసుకువెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

పిట్లం, జనవరి 5: పిట్లంలోని భవిత సెంటర్‌లో వైద్యాధికారిణి విశాలాక్షి దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈవో దేవీసింగ్, ఐఈఆర్టీలు కమల్‌కిశోర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెబొగుడ తండాలో బోరు డ్రిల్లింగ్

ఎల్లారెడ్డి, జనవరి 5: నాగిరెడ్డిపేట మండలంలోని పల్లె బొగుడ తండాలో బోరు డ్రిల్లింగ్ పనులను జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. జడ్పీ నిధులతో బోరు వేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శంకర్‌నాయక్, పీర్యానాయక్, రాజు, వీరు తదితరులు పాల్గొన్నారు.

వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ఆర్డీవో భుజంగరావు
- నేటితో ముగియనున్న ప్రజాపాలన గ్రామసభలు
- పర్యవేక్షిస్తున్న అధికారులు

బాన్సువాడలో డాటా ఎంట్రీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో భుజంగరావు

బాన్సువాడ టౌన్/బాన్సువాడ రూరల్/బాన్సువాడ/ఎల్లారెడ్డి/ నిజాంసాగర్/ గాంధారి/రాజంపేట/బీబీపేట్, జనవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు అందజేసేందుకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం నేటితో ముగియ నుంది. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో అధికారులు, సిబ్బంది శుక్రవారం దరఖాస్తులను స్వీకరించారు. గ్రామాల్లో అధికారులు కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ చేయడంపై సంబంధిత డాటా ఎంట్రీ ఆపరేటర్లతో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుల ఆన్‌లైన్ ఫారాన్ని పూరించేటప్పుడు ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరికీ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అందిస్తామని చెప్పారు. వాటిని ఉపయోగించి వైబ్‌సైట్‌లో లాగిన్ కావాలని, నమూనా ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాన్ని వారికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కమిషనర్ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్, అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని పోచారం, మొగులాన్‌పల్లి, పులిగుండు తండా గ్రామాల్లో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు నోడల్ అధికారులు తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. బాన్సువాడలోని 19 వార్డుల్లో 8 వేల దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గున్కుల్‌లో నిజాంసాగర్ ఎంపీడీవో నాగేశ్వర్, సర్పంచ్ గంగి సునీతా రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, హసన్‌పల్లి గ్రామంలో తహసీల్దార్ భిక్షపతి, సర్పంచ్ సంగమేశ్వర్‌గౌడ్ తదితరులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గాంధారి మండలంలోని చద్మల్ తండా, సోమ్లానాయక్ తండా, తిమ్మాపూర్, గుర్జాల్ తండా, వండ్రికల్, బీర్మల్ తండాల్లో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో సతీశ్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి తదితరులు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకిరించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం, మాటూరు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఎంపీపీ రాజ్‌దాస్, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో రఘు తదితరులు పాల్గొన్నారు. రాజంపేట మండలం శేర్‌శంకర్ తండా గ్రామంలో దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ సంగీత, స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున బాబు తదితరులు పాల్గొన్నారు. దోమకొండతోపాటు గొట్టిముక్కుల, సీతారాంపల్లి, లింగుపల్లి, అంబారీపేట్, ముత్యంపేట్, బీబీపేట్‌తో పాటు మాందాపూర్, జనగామ, యాడారం, మాల్కాపూర్, ఇస్సానగర్, తుజాల్‌పూర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పల్లి, గాంధారి మండలంలోని చద్మల్ తండాలో ప్రజా పాలన దరఖాస్తు పత్రాలను స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై నర్సింహులు

నస్రుల్లాబాద్, జనవరి 5 : బీర్కూర్‌లో మున్నూరు కాపు యువత ఆధ్వర్యంలో ఆకుల సాయికుమార్, కొట్టం సంతోష్ స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై నర్సింహులు శుక్రవారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు దేహదారుఢ్యానికి దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడి, గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల సర్వే

నస్రుల్లాబాద్, జనవరి 5 : మండల కేంద్రంలో శుక్రవారం బడి బయటి పిల్లల సర్వే సీఆర్పీ సంజీవ్, సాయిలు నిర్వహించారు. 6 నుంచి 14 ఏండ్లు, 15 నుంచి 19 ఏండ్లు ఉన్న విద్యార్థులను గుర్తించి బడిలో చేరేలా ప్రోత్సాహించామని తెలిపారు.

పుస్తె, మెట్టెల అందజేత

కామారెడ్డి రూరల్, జనవరి 5 : కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన పిడతల రమ్య వివాహానికి కామారెడ్డి మండల వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేశ్‌కుమార్ పుస్తె, మెట్టెలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రశాంత్, జగ్గ శ్రీకాంత్, చిన్న నర్సింహులు, సందీప్, సాకలి రాజేశ్, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు వినతి

కామారెడ్డి రూరల్, జనవరి 5 : జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఎంఈవో ఎల్లయ్యకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి నగర స్టూడెంట్ ఫర్ సేవా కన్వీనర్ సంజయ్ మాట్లాడుతూ.. కామారెడ్డిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పాఠశాలలు నడుపుతున్నారని అన్నారు. విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురిచేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాను, యశ్వంత్, ఆదర్శ్ పాల్గొన్నారు.

కామారెడ్డి తహసీల్దార్‌గా జనార్దన్

కామారెడ్డి, జనవరి 5 : కామారెడ్డి మండల నూతన తహసీల్దార్‌గా జనార్దన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బీర్కూర్ తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై కామారెడ్డికి వచ్చారు. కామారెడ్డి తహసీల్దార్‌గా పని చేసిన లత బీర్కూర్‌కు బదిలీపై వెళ్లారు.

కబడ్డీ జూనియర్ జట్ల ఎంపిక

కామారెడ్డి, జనవరి 5 : జిల్లాలోని 20 ఏండ్లలోపు కబడ్డీక్రీడాకారుల (బాలబాలికల) ఎంపిక కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని లయోల పాఠశాలలో నిర్వహించారు. ఎంపికైన వారు ఈ నెల 14వ తేదీ సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాణాల భాస్కర్ రెడ్డి, పేట సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటి, లక్ష్మణ్, అనిల్, లక్ష్మణ్ రాథోడ్, నరేశ్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో పోలీసుల తనిఖీలు

కొత్తబాది తండా శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గాంధారి, జనవరి 5: గంజాయి సాగుచేయడంతోపాటు విక్రయిస్తున్నారనే అనుమానంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గాంధారి మండలంలోని పలు తండాల్లో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని గొల్లాడి తండా, ఆవులకుంట తండా, తిప్పారం తండా, కొత్తబాది తండాల్లో అనుమానితుల ఇండ్లతోపాటు, పంట పొలాలు, గడ్డివాములు, పెంట కుప్పల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సదాశివనగర్ సీఐ రామన్ మాట్లాడుతూ.. నిషేధిత గంజాయిని సాగు చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయిని సాగుచేసినా, విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీల్లో సీఐ రామన్‌తోపాటు, ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాసులు, గాంధారి ఎస్సై ప్రేమ్‌దీప్, ఆయా పోలీస్‌స్టేషన్లలో పనిచేసే కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేత

ఎల్లారెడ్డి, జనవరి 5: పట్టణంలోని పలు ప్రాంతాలకు రెండు రోజుల పాటు(శని, ఆదివారాలు) నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా కమిషనర్ జీవన్ తెలిపారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో చేపడుతున్న పైప్‌లైన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. పైప్‌లైన్ పనుల కారణంగా పట్టణంలోని ఇందిరానగర్, గాంధీనగర్, బీసీ కాలనీ, గాంధీ చౌక్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు.

మార్మోగుతున్న శ్రీరామ నామం

- గడప గడపకూ అక్షింతల అందజేత
- వైభవంగా అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర

అయోధ్య పూజిత అక్షింతలతో పిట్లం మండలం చిన్నకొడప్‌గల్ గ్రామస్తులు

నిజాంసాగర్/ ఎల్లారెడ్డి రూరల్/ మద్నూర్/ పిట్లం/ పెద్ద కొడప్‌గల్/ బాన్సువాడ రూరల్/మాచారెడ్డి/ దోమకొండ/బాన్సువాడ టౌన్, జనవరి 5: అయోధ్య పూజిత అక్షింతలను గ్రామాల్లో గడప గడపకూ అందజేస్తున్నారు. పల్లెల్లో శ్రీరామ నామం మార్మోగుతున్నది. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం నెలకొంటున్నది. నిజాంసాగర్‌లోని చంద్రమౌళీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి శ్రీరాముని సంకీర్తనలు, భజనలతో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌దాస్‌తోపాటు అయ్యప్ప గురు స్వామి సంగమేశ్వర్‌గౌడ్, మాలధారులు దిలీప్‌రెడ్డి, ప్రతాప్, కిశోర్, అర్జున్, శివ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పట్టణంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో అక్షింతల పంపిణీ చేపట్టారు. 22వ తేదీన శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో ప్రతి ఒక్కరూ అక్షింతలను తలపై వేసుకోవాలని సూచించారు. తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు తులసీదాస్, ప్రణయ్ పంతులు, మహేశ్, కళ్యాణి, ప్రవీణ, వంగపల్లి కాశీనాథ్, సిద్ధి విజయలక్ష్మి, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో అక్షింతల శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు.

మద్నూర్‌లో అక్షింతల పంపిణీ

మద్నూర్, పెద్దకొడప్‌గల్ మండలంలోని తుప్‌దల్ గ్రామంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలను అందజేశారు. పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్‌లో అక్షింతల ఊరేగింపు నిర్వహించారు. కాషాయం కండువాలు ధరించి రామనామాన్ని నినదించారు. రామారెడ్డిలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, మహిళా భక్తులు కలిసి డప్పు చప్పుళ్ల మధ్య ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు.

బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు తండా గ్రామ హనుమాన్ ఆలయం నుంచి భజనలు, కీర్తనలతో ప్రధాన విధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పూజిత అక్షింతలను అందజేశారు. గ్రామపెద్దలు సంజీవ్‌రెడ్డి, కొండ సాయిలు, బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలం పాల్వంచలో బీజేపీ నాయకుడు తోట బాలరాజు ఆధ్వర్యంలో అక్షింతల శోభాయాత్ర చేపట్టారు. దోమకొండలో పంతులు రామకృష్ణ అక్షింతలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. బాన్సువాడలోని వినాయకనగర్‌లో స్థానిక కౌన్సిలర్ దొన్కంటి వెంకటేశ్ ఆధ్వర్యంలో గడపగడపకూ అక్షింతలను అందజేశారు.

'ఉన్నతి' లక్ష్యాలను చేరుకోవాలి

మాట్లాడుతున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాంచందర్

నిజాంసాగర్, జనవరి 5: మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయి సమావేశాన్ని కాంప్లెక్స్ హెచ్ఎం రాంచందర్ నిజాంసాగర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారంప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధనలో ఉన్నతి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జీవశాస్త్రం బోధించడంలో మెళకువలను పాటించాలని సూచించారు. సమయసారణి అనుసరిస్తూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లైబ్రరీ పీరియడ్‌ను ఏర్పాటుచేసి పుస్తక సమీక్షలు నిర్వహించాలని, ప్రతి ఉపాధ్యాయుడు జనవరి నెలకు సంబంధించి పీరియడ్ ప్లాన్‌ను రూపొందించుకోవాలన్నారు. అనంతరం నోడల్ అధికారి అమర్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసిన ఉన్నతి పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులతోపాటు సీఆర్పీలు శ్రీధర్‌కుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా మహేందర్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 5: ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా అల్లం మహేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్ బొకే అందించి స్వాగతం పలికారు. ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా పనిచేసిన సురేశ్ బదిలీపై వెళ్లడంతో నాగిరెడ్డిపేట్‌లో పని చేస్తున్న మహేందర్‌ను ఉన్నతాధికారులు ఎల్లారెడ్డికి బదిలీ చేశారు. నూతన తహసీల్దార్‌కు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయబ్ తహసీల్దార్

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

★కొట్టల రాజశేఖర్ S/o. రాజేశ్వర్, ఇ.నెం.4-63, ఫత్రెపూర్, ఆర్మూర్, జి॥నిజామాబాద్ నా పాస్‌పోర్ట్ నెం. F5361140 బైక్ పై ఆర్మూర్‌కు వెళ్ళుచుండగా పోయినది. దొరికినవారు Pls. Call 99486 23026
NTZ-318892

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దివ్యాంగుల పాఠశాలను సందర్శించిన అధికారులు

వివరాలను నమోదు చేసుకుంటున్న అధికారులు

రామారెడ్డి, జనవరి 5: మండల కేంద్రంలోని దివ్యాంగుల పాఠశాలను సహిత విద్యజిల్లా సమన్వ య కర్త శ్రీపతి, డీఆర్డీఏ బాబయ్య శుక్రవారం సందర్శించా రు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్న విషయాలను వారు నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయులు రమేశ్, సృజన, కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్, సీఆర్పీలు మహమూద్, సురేఖ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అజీముద్దీన్ పాల్గొన్నారు.

ఆధార్.. అవస్థలు

- డోంగ్లీలో ఒకే ఆధార్ కేంద్రం
- ఉదయం నుంచి ప్రజలు బారులు

డోంగ్లీలోని ఆధార్ కేంద్రంలో కూర్చున్న ప్రజలు

డోంగ్లీ, జనవరి 5: ఆధార్ కార్డు కోసం మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అభయహస్తం ప్రజాపాలన దరఖాస్తులకు ఆధార్ తప్పనిసరి కావడంతో ప్రజలు ఆధార్ సెంటర్ వద్ద బారులు తీరుతున్నారు. మండలంలో కేవలం ఒకే ఒక్క ఆధార్ కేంద్రం ఉండడంతో వారికి తిప్పలు తప్పడం లేదు. మండలంలో సుమారు 30 వేల మంది జనాభా ఉన్నారు. ఆధార్ కేంద్రాన్ని మండల కేంద్రం డోంగ్లీలో ఏర్పాటుచేశారు. గ్రామాల నుంచి ఉదయమే ఆధార్ కేంద్రానికి ప్రజలు చేరుకుంటున్నారు. ఒక్కో రోజు కేవలం 30 మందికి మాత్రమే కార్డులు అందిస్తున్నారు. ప్రతి రోజూ వందల మంది కేంద్రానికి వచ్చి నిరీక్షిస్తున్నారు. ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పుల కోసం ఎక్కువ మంది కేంద్రానికి వస్తున్నా.. వివరాల నమోదు, జారీ ప్రక్రియలో జాప్యం జరుగుతున్నది. వచ్చిన వారికి టోకెన్లు ఇస్తున్నా.. వారి నంబర్ రాకపోవడంతో మరుసటి రోజు రావాల్సి వస్తున్నది. మండలంలో మరో కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై మీ సేవ కేంద్రాల పర్యవేక్షకుడు భైరవ్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. కొత్తగా ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అనుమతులు లేవన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇదే విషయమై మీ సేవ కేంద్రాల ఈడీఎం ప్రవీణ్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన స్పందించ లేదు.

కూలి పనులు మానుకుంటున్నం..

ఆధార్ కేంద్రానికి బయోమెట్రిక్ కోసం వెళ్తే.. అక్కడ వందల సంఖ్యలో ప్రజలు ఉంటున్నారు. కూలి పనులు మానుకొని కేంద్రం వద్దనే కూర్చున్నా ఆ రోజు పని పూర్తవుతుందన్న నమ్మకం లేదు. సెంటర్లు పెంచితే బాగుంటుంది.

- కుర్మ బీరుగొండ, కుర్ల

పనులకు ఇబ్బంది అవుతున్నది..

మండలంలో ఒకే సెంటర్ ఉండడంతోనే రద్దీ ఏర్పడుతున్నది. ఉదయం వెళ్తే సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తున్నది. టోకెన్ ఉన్నా.. సిగ్నల్స్ లేకపోవడంతో పని త్వరగా కావడం లేదు. సెంటర్లు పెంచాలి.

- వీరేశ్ బాల్గానే, మొఘ